# సుకన్య

భాస్కరుని బంగారు కిరణాలు లోకమంతా వెలుగు నింపేవేళ చీకటి ఆ వెలుగుల దాడికి బెదిరిపోయి పరుగులు తీసేవేళ. నిజంగా ఆవేళ మనస్సుకు ఎంతో ఆహ్లాదకరమైనది. దేవళపుగంటలు భక్తిని కల్గింపచేస్తూ ప్రతిహృదయంలో ప్రతిధ్వనించేలా మ్రోగుతున్నాయి.

సుకన్యకు మెలకువ వచ్చింది. కోవెల గంటారవళి సన్నగా వినిపిస్తూ ఉంది. భారంగా మంచంమీద కదలింది.

“ఏమిటో! అప్పుడే తెల్లవారి పోయిందా?” వేడినిట్టూర్పు విడిచింది. చల్లనిగాలులు హాయిగా తనువులకు పులకింతలు కలిగించే ప్రభాత సమయంలో ఆమె గుండెల్లో భారమైన వేడినిట్టూర్పు గాడ్పు.

“అమ్మా సుకన్యా! తెల్లారిపోయిందమ్మా, వాకిలి కడిగి ముగ్గు వెయ్యవూ?” తండ్రి మాటలకు ఉలిక్కిపడింది. భారంగా అడుగులు వేసుకుంటూ పెరట్లోకి నడిచింది.

మందారాలు మౌనంగా స్వాగతం ఇచ్చాయి. పెరటిలో పనిముగించి గదిలోకివచ్చి కూర్చుంది.

పూజ ముగించుకొని తండ్రి తనవైపు రాగానే సుకన్య ముఖం మరింత చిన్నబోయింది.

"అమ్మా సుకన్యా! కుంపటి వెలిగించలేదేమమ్మా!" అవధాని మాటకు బదులు చెప్పలేకపోయింది. కూతురు మౌనంలోని భావం అర్థం చేసుకున్నాడు అవధాని. సుకన్య ఎప్పుడు మౌనంగాఉన్నా ఇంచుమించుగా అదే భావం.

"సరేలేవమ్మా అలా వెళ్ళొస్తాను" అంటూ బయలుదేరాడు.

సుకన్య అలాగే కూర్చుండి పోయింది. ఆమె కనులలో నిలచిన రెండు కన్నీటి బొట్లు చెక్కిలిపై జారేయి. ఈ రోజు నాన్నగారికి కాఫీ ఇవ్వలేకపోయింది. తను నాలుగైదు రోజులుగా కాఫీపొడి నిండుకున్నా చుట్టుప్రక్కల ఇళ్ళలలో బదులుతెచ్చి కాఫీపెట్టి తండ్రికి మాత్రమే ఇచ్చేది ఎంతజాగ్రత్తగా వాడినా నిన్నటికే అయిపోయింది. పూర్తిగా బాకీ చెల్లిస్తేనేగాని పాలుపొయ్యనని పాలవాడు ఖచ్చితంగా చెప్పేశాడు. ఇంకా తను బ్రతిమలాడితే ములుకులాటి సలహాతో తన మనస్సు గాయపరిచేడు. సూటిగా కాకపోయినా తనకు అందరూ ఇలాంటి సలహాలే ఇస్తున్నారు.

"బ్రతకటం నేర్చుకో ఇంత అందాల బొమ్మవు. కాళ్ళావేళ్ళా పడి బ్రతిమాలితే ఏమి సాధించలేవు. లోకాన్ని అర్థం చేసుకో. అందమే నీ పెన్నిధి. వయస్సు ఉన్న నీకు సాధ్యం కానిది ఏమిటి?" ఇలాంటి మాటలు విన్నప్పుడు సుకన్య మనసు విలవిలలాడి పోతుంది. అందుకే ఇంకెవ్వరినీ ఎటువంటి సహాయం కోరదలుచుకోలేదు. తనకు అతి సామాన్యంగా జీవించే అవకాశాన్ని ఇవ్వలేని దేముడు ఇంత అతిలోక సౌందర్యాన్ని ఎందుకు ప్రసాదించేడు. తనకుగల శాపం ఈ సౌందర్యాన్ని ఎన్నోసార్లు నిందించు

తుంది. అలా ఎంతోసేపు నిర్జీవ ప్రతిమలా ఉండిపోయిన సుకన్య తండ్రి రాకనే గమనించలేదు.

"అమ్మా! సుకన్యా! కాసిన్ని మంచినీళ్ళు ఇవ్వు తల్లీ" అవధాని మాటకు ఉలిక్కిపడింది. గిన్నె తీసుకొని వీధిలో పంపు దగ్గరకు మంచినీటి కోసం వెళ్ళిన సుకన్యను వీధిపంపు మౌనంగా పలకరించింది. అప్పటికే బందైపోయిన పంపువైపు నిస్సహాయంగా చూసి ఇంట్లోకి వెళ్ళిపోయింది. ఏదో ఆలోచిస్తూ ఆలస్యంచేస్తే అతి సామాన్యమైన త్రాగేనీరు కూడా దుర్లభమైపోయింది. ఎవరి సహాయాన్ని వాంఛించకూడదు అనుకున్న తనకు తన ఆలోచనకు అంతరాయం వచ్చింది. మంచినీటి కోసం కూడా పొరుగింటికి వెళ్ళవలసి వచ్చింది. సుకన్య పేలవంగా నవ్వుకుంది.

"నాన్నా! పంపు కట్టేసారు ప్రక్క ఇంటికెళ్ళి నీళ్ళు పట్టుకొస్తా" అంటూ బయటికి నడిచింది.

అవధాని కూతురువైపు చూసి భారంగా నిట్టూర్చాడు. రోజురోజూ సుకన్యనుచూస్తూవుంటే చెప్పలేని ఆవేదన కలుగుతోంది. తానేం చెయ్యకలడు. తనస్థితి ఇంతదీనంగా ఉంటుందనిసుకన్యనుపోషించలేకపోతాడని కలలోనైనా ఊహించలేదు. ఊహించివుంటే సుకన్యను తన బిడ్డగా చేసుకొని ఉండేవాడు కాదు. చదువు అంతగా అబ్బని అవధాని వయస్సు పెరిగిన తర్వాత వంటవాడుగా జీవితాన్ని తనే స్థిరపరచుకున్నాడు. అతనికి ఆ జీవితం ఎంతో సుఖమయంగా ఉండేది! పెళ్ళి జీవితంలో ఒక మలుపు అంటారు. అవధాని జీవితం కూడా ఒక మలుపు తిరిగింది. అదృష్టమో దురదృష్టమోకాని అతనితో జీవితాన్ని పంచుకోడానికి అతనిఇంట అడుగుపెట్టిన ఇల్లాలు ఒక సంవత్సరానికే ప్రసవసమయంలో కన్నుమూసింది! కొంత కాలం అవధాని పిచ్చివాడిలా తిరుగకపోలేదు.

కాలం చాలా చిత్రమైనది. మనసు గాయాలు మాన్పేశక్తి కూడా దానికి ఉందేమోమరి అవధాని గత జీవితాన్ని మరపించేసింది. ఎప్పటిలా హుషారుగా మళ్ళీ లోకంలా మనిషిగానే మారి జీవించగలుగుతున్నాడు అవధాని.

అవధాని అంటే ఊళ్ళోనేకాదు, చుట్టుపక్కల ఊళ్ళన్నింటిలోను చాలా పేరుఉంది.అతనికంత ప్రతీతి.నలభీమ పాకాల్ని మరపించేవాడయాడు వంటలో.ఓసారి అవధాని పొరుగూరుపెళ్ళి వచ్చేసరికి ఓచిత్రంజరిగింది. తన ఇంటి తాళం పగలగొట్టబడి వుంది. అవధానికి తన ఇంటిలో దొంగలు పడి నందుకు చెప్పలేనంత నవ్వు వచ్చింది. తన ఇంటిలో ఏముంటాయో దోచుకుపోయేందుకు? నవ్వుకుంటూనే ఇంటిలోనికి వెళ్ళాడు. అయితే అతనికి ఆశ్చర్యపరిచే దృశ్యమొకటి ఎదురైంది. తన మంచం మీదని పసిపాప. చూస్తూనే మరి ఏ అనుభూతి కలిగిందో ఏంఅనుబంధం ఉందోకానే ఆ పసిదానిని గుండెకు హత్తుకున్నాడు. ఆ బిడ్డ తన ఇంటికి ఎలా వచ్చింది? ఎవరి బిడ్డ? ఈ కారణాలు ఏవీ తెలుసుకోవాలనిపించలేదు. ఎందుకో ఆ పాపాయి మీద తెలియని మమత అనురాగం కలిగింది. తన బిడ్డగా పెంచ లేక పోతాడా అని అనిపించింది. పాలుపోసి లాలించేడు. గోరు ముద్దలు కొసరి కొసరి తినిపించేడు. పలకా బలపం ఇచ్చి బడికి పంపేడు. సుకన్య పెరిగి పెద్దదవుతున్న కొలది అప్పుడప్పుడు అవధానికి ఓ ఆలోచన వచ్చేది తను ఈ బిడ్డను ఎలా పెళ్ళి చేయగలడా అని. కాని ఈ ఆలోచన అతని హృదయంలో ఎంతోసేపు నిలిచేది కాదు. సుకన్య అందాల బొమ్మ, తెలివైనది. పనీ పాటలు చదువు సంధ్యా అన్నీ నేర్చిన సుకన్యకు ఏ లోటూ రాదు. పెండ్లి చేయటం ఏమంత కష్టం కాదు అనిపించేది అతనికి. అయినా సుకన్య పెండ్లికోసం తన సంపాదన చాలా మటుకు భద్ర పరిచేడు వైభవంగా పెళ్ళిచేయాలని.

అవధానికి ఎప్పుడూ నిశ్చింతగా ఉండేది. రోజురోజుకు అతని సంపాదన పెరుగుతూ వచ్చింది. వసంతం క్షణికం అన్నట్టు అవధాని జీవితంతో ఈ ఆనందం దోచుకుని పోయే గ్రీష్మం అడుగుపెట్టింది. సుకన్యకు యౌవ్వన వసంతోదయం అయ్యేసరికి అవధాని చూపు మందగించింది. కాలం అతనిని అశక్తుని చేసింది. సంపాదన ఆగిపోయింది. సుకన్య పెళ్ళికని దాచిన ధనం తన చూపుకోసం ఖర్చయిపోయింది. ఫలితం తను ఒక నిరుపేదగా మారిపోయాడు. రూప యౌవ్వన సంపన్నురాలు గుణవంతురాలు అయిన కన్యారత్నం తన దగ్గర ఉండిపోయింది. ఇప్పుడు సుకన్యకు పెళ్ళి చేయగలననే ఆశ అంతరించిపోయినా కనీసం ఆమెకు ఏ కష్టమూ రాకుండా పోషించాలి అనేదే అతని ప్రయత్నం. తండ్రిగా తను సుకన్యను పోషించలేక పోతున్నందుకు కృంగిపోతున్నాడు.

ఇంతలో హఠాత్తుగా తన దూరపు బంధువు శర్మరాక అవధానికి తాత్కాలిక మనశ్శాంతి కలిగించింది! పేదరికంలో మాధవశర్మకు ఆతిధ్యం ఇవ్వలేకపోతున్నందుకు సుకన్య నొచ్చుకుంది. అతను ఉన్న నాలుగు రోజులు నిత్యావసరాలకు ఏలోటూ రాకుండా మాధవశర్మే చూసుకున్నాడు. అంతేకాదు సుకన్యను తనతో తీసుకుని పెళ్ళి మరి కొస్త విద్యావంతురాలుగా చేసి తన కాళ్ళమీద తను నిలబడేటట్లు చేస్తానన్నాడు.

అవధానికి మరేమీ ఆలోచించాలనిపించలేదు తనకు సుకన్యను పోషించే స్తోమతు అంతరించి పోతోంది.

"అలాగే! బావా! అలాగే?" సంతోషంతో గలిగిన తడబాటుతో అన్నాడు. సుకన్య కూడా తన తండ్రికి భారం కాకుండా బ్రతుక కలుగు తాను అని మురిసిపోయింది. అవధానికి, శర్మ దగ్గరే తన బిడ్డఉన్నా, తన కన్నా బాగా చూసుకుంటాడన్న నమ్మకం ఉంది. తను ఎలాగైనా శర్మ

సహకారంతో ఏదైనా ఉద్యోగం సంపాదించి తండ్రిని సుఖపెట్టాలి. అతని హృదయంలో పేరుకున్న నిరాశానిస్పృహలను తొలగించి అతనినిసంతోషంగా జీవించేలా చేయాలి. ఏవేవో అందమైన ఊహలతో తేలిపోతోంది సుకన్య. ఇద్దరి హృదయాలు శర్మపట్ల కృతజ్ఞతతో నిండిపోయేయి. అవి రెండు పూవులై శర్మ పాదాలపైన వ్రాలి అతనిని ఒక భగవంతునిలా పూజిస్తున్నాయి. అయితే ఆ అర్హత సాధారణంగా ఎంతమందికో ఉండదు. శర్మ అవధాని పట్ల చూపిస్తున్న ప్రేమ ఆప్యాయత, అతను చూపే కరుణ అవధాని దగ్గరఉన్న నిధిని, సుగుణరాశిని, అందాల రాణిని తన వశము చేసుకోవడానికి మాత్రమే. అదేం తెలుస్తుంది ఆ అమాయకులకు. ఆమెను విద్యావంతురాలిని చేసి,సంఘంలో మనిషిగా నిలపెట్టి మన సాంప్రదాయంలో అతి ప్రధానమైన వివాహబంధం ఏర్పరచి సుకన్యకు సుఖమయ జీవితం అందించడానికి ఏ మాత్రమూ కాదని పాపం వాళ్ళకేం తెలుసు. అహో రాత్రులు ధనార్జనకోసం, వ్యాపార రంగంలో తలమునకలయ్యే తనకు, ఇల్లాలుగా, ప్రధాన బాధ్యతలు విస్మరించి ఇంటిని మరచి సంఘంలో పేరు ప్రతిష్టలకోసం మహిళా సంఘాలలో మునిగితేలే తన భార్యకు మా డబ్బే పెంచుతుంది మా పిల్లల్ని అన్న భావాలతో ఆ భార్యాభర్తలు జన్మనిచ్చిన అరడజను సంతానానికి సేవకురాలిగా, వంటమనిషిగా ఆ ఇంట పడి ఉండటానికని అందుకే సుకన్య కావాలని, అందుకే ఆ తీపిమాట అని అందుకే ఉన్న మూడు రోజులు వాళ్ళని సంతృప్తి పరచి ఆనందంతో ముంచివేస్తున్నాడని ఆ రెండు హృదయాలు తెలుసుకోలేవని శర్మకు తెలుసు. అందుకే వాళ్ళపైన అంతులేని ప్రేమ చూపించి సుకన్యను తీసుకొని వెళ్ళడానికి అనుమతి తీసుకొన్నాడు. సుకన్య ప్రయాణమై వెళ్ళిపోతుండగా అవధానికి ఎందుకో చెప్పలేనంత దుఃఖము వచ్చింది. కణ్వ మహర్షిలాంటి మహానీయుడే భరించలేకపోయాడు. తను పెంచిన శకుంతల తన ఆశ్రమాన్ని

వీడి అత్తవారింటికి వెళ్ళిపోతుంటే ఇక తనలాంటి సాధారణ మానవుని మనఃప్రవృత్తి ఏమని చెప్పగలం. తనకు తెలియకుండా తన జీవితంలోకి ప్రవేశించిన సుకన్య తన ఇంటినుంచి నూతన వధువుగా మస్తాబై మేళ తాళాలతో అత్తవారింటికి వెళుతుందని ఊహించిన అవధానికి సుకన్యఇలా దీనంగా కదలిపోతున్న దృశ్యం మరింత బాధను కలిగించి అతని దుఃఖాన్ని రెండింతలు చేస్తోంది. సుకన్యకు కూడా బాధగానేఉన్నా తను ఎలాగైనా శ్రమించి ముందు తండ్రిని సుఖపెట్టగలనుకదా అనే ఆనందం ఆమెలో చోటు చేసుకొని శోక సంతోషాల మిశితమైంది ఆమె మనసు. ఆమెకళ్ళల్లో జాలువారే కన్నీళ్ళు ఒక కంట ఆనంద బాష్పాలుగా మరోకంట దుఃఖ బాష్పాలుగా స్రవిస్తున్నాయి. అవధాని కూతురి కళ్ళు తుడిచి తన బాధను గుండెల్లో దాచుకొని సుకన్యను సాగనంపేడు. ఒకనాడు విష్ణుదత్తునికి లభించిన గోదాదేవిలా తనకు ఈ పాప భగవత్ప్రసాదమని మురిసిపోయిన అవధానితన బిడ్డకు పెళ్ళిచేసి సాగనంప లేకపోయినందుకు అతనికి కలుగు తున్న ఆవేదన ఒంటరిగానే భరించడం అలవాటు చేసుకున్నాడు.

సుకన్య రాకతో శర్మ ఇంటిలో పనిమనిషి కొఱత తీరిపోయింది. నమ్మకంగా పనిచేసే ఒక సేవకురాలు లభించింది. సుకన్య ఆ ఇంటికి వచ్చినపుడు తనుకూడా ఖరీదైన చీరలు కట్టుకొని కార్లలో షికార్లు నగలు పెట్టుకొని ఎంతో ఆడంబరంగా అలంకరించుకొని తిరగాలని కోరుకోలేదు. కావాలనుకోలేదు. కాని అతి సామాన్యమైన జీవితాన్ని గడుపుతూ తనకు భవిష్యత్తులో ఉపయోగపడే విద్యార్జనచేస్తూ జీవితాన్ని తీర్చి దిద్దుకునే అవ కాశం లభించిందని ఎంతగానో ఆశపడది. ఆ ఆశ నిరాశైంది. తనుఇంటికి వచ్చిన రోజున ఇంటినిండా ఎంతోమంది పనివాళ్ళు. వాళ్ళందరి స్థానంలో ఇప్పుడు సుకన్య ఉంటోంది. పనులన్నీ ఒక్కొక్కటీ తనే చేయవలసి వచ్చే సరికి అర్థమైంది సుకన్యకు తను ఇక్కడకు ఎందుకు తీసుకొనిరాబడ్డదీ.

ఎప్పుడో రోజులో తనకు తెలియకుండా నిద్రతెరలు వాలిపోయినప్పుడు తప్ప మరెప్పుడూ సుకన్యకు విశ్రాంతి లభించదు. ఎప్పుడూ అలసట ఎరుగని సుకన్య శారీరకంగా ఇంత అలసటను భరించలేకపోతుంది. ఇక ఆ కుటుంబములోని వ్యక్తులందరూ తనను ఒక్కొక్కరూ ఒక్కొక్కలా చూస్తారు. తనతోటిదే అయిన శర్మగారి పెద్దమ్మాయికి సుకన్యను చూస్తే చెప్పలేనంత ఈర్ష్య, అన్ని సంపదలూ తనకు ఉన్నా చివరకు అందానికి నిర్వచనమైన పేరు కూడా తనదే అయినా తనకు లేనిదానిని అందని దానిని ఏదో సుకన్య పొందినట్టు బాధ పడిపోతూ ఉంటుంది. క్షణక్షణం లావణ్య ఆమెను కించ పరుస్తూనే ఉంటుంది. సుకన్య విశాలమైన నేత్రాలలోని మెరుపును ఆమె సహించలేదు. ఆ కళ్ళల్లో ఎప్పుడూ కన్నీళ్ళే ఉంటే లావణ్యకు ఆనందం అందుకోసం ఏమైనా చేస్తుంది.

ఇక సుందర్ ఏదో భావంతో చూస్తాడు. చూడటమే కాదు, 'ఇంటిలో అన్ని పనులూ చేస్తున్నావు కదా? నాకు కావలసిన ఈ ఒక్కపని కూడా చెయ్యకూడదూ?" అంటూ తన కోరిక వ్యక్త పరచి అసభ్యకరంగా ప్రవర్తిస్తాడు. సుకన్య ఎప్పుడూ అతనికి దూరంగా ఉండాలని విశ్వ ప్రయత్నం చేస్తుంది. అతను ఇంట్లో ఉంటే తన జీవితం దుర్భరంగా దినదిన గండంగా ఉంటుంది. "నిన్ను ఎప్పుడో ఒకనాడు నా వశం చేసుకుంటాను" అంటూ అపరకీచకుడిలా నవ్వే ఆ సుందర్‌ని చూస్తే సుకన్య పెనుగాలిలో చిగురుటాకులా విలవిల లాడిపోతుంది.

ధనలక్ష్మి తనమీద అధికారం చెలాయించడం ఆజ్ఞాపించడం తప్ప మరేమీ పట్టించుకోదు.

ఇంటిలో నౌకర్లకొరత తీర్చేనని అవధాని పెట్టలేని అన్నం ఇవ్వలేని చీరలు సుకన్యకు తాను ఇవ్వగలుగు తున్నానని ఒక మంచిపని చేశాను అని తనను తాను సమర్థించు కుంటాడు శర్మ.

ఇలా జీవితం గడపడం సుకన్యకు దుర్భరంగా ఉంది. తన పాత జీవితమే మెరుగేమో అనిపిస్తోంది, తనను ప్రాణాధికంగా ప్రేమించే తండ్రి నీడలో వస్తులుపడి ఉండటం తనకు ఎప్పుడూ కష్టం అనిపించలేదు. ఒకసారి తండ్రి ఒడిలో తల దాచుకొని వెక్కి వెక్కి ఏడవాలనిపించింది సుకన్యకు.

తను ఇక్కడ ఎంతో సుఖపడుతున్నదని తన భవిష్యత్తుకు పూల బాట వేయబడుతున్నదని అందమైన కలలలో ఆనందంగా బ్రతుకుతున్న తండ్రి ఆనందాన్ని చెదరగొట్టడానికి సుకన్య మనసు అంగీకరించలేదు. తను ఇక్కడ ఉంటే శర్మ తన తండ్రికి కొంత డబ్బు పంపుతున్నాడు అతనికి ఉన్న ఆ కాస్త ఆసరా పోగొట్టదలుచుకోలేదు. అందుకే ఏ లేఖ లోనైనా ఎన్నోసార్లు తండ్రికి తన బాధలు రాయాలనిపించినా రాయకుండా తనకు ఇక్కడ లభించని అతని ఊహలలో తను పొందుతున్న నిజానికి తనకు లేని సుఖాలను మాత్రమే రాసేది.

ఓ రోజు ఇల్లంతా హడావుడిగా వుంది. సుకన్య ఇంటిని మరింత శ్రద్ధగా అలంకరించింది. లావణ్య అద్దం ముందు కూర్చొని పదే పదే ఎన్నో గంటలసేపు విసుగులేకుండా చూసుకుంటూ అలంకరించుకుంటూనే ఉంది. సుకన్య మరింతగా వంటింట్లో పనులతో సతమత మవుతూనే ఉంది. తన తోటి వయస్సుదే అయిన లావణ్యకు ఈ రోజు పెళ్ళి చూపులు లక్ష లూపాయలు కట్నమిచ్చి వరుడుని కొనుక్కోకల అదృష్టవంతురాలు తను కోరుకున్న విధంగా జీవించడానికి అన్ని అర్హతలూ ఉన్నాయి లావణ్యకు. అయితే ఇవన్నీ సుకన్యలో అసూయను లేపడంలేదు. అప్పుడు ఆమె ఆలోచన ఒక్కటే. లావణ్య పెళ్ళి చేసుకుని అత్తారింటికి వెళ్ళిపోతే తనకు

కాస్త ప్రశాంతి లభిస్తుందేమో. ఆలోచిస్తూనే ఇంటి పనులన్నీ నిర్విరామంగా చేసుకొంటోంది సుకన్య.

పెళ్ళివారు వచ్చేరని త్వరగా కాఫీ టిఫిన్లు తీసుకురమ్మని ఆజ్ఞాపించి వెళ్ళిపోయాడు సుందర్.

వాళ్ళకు ఎదురుగా వెళ్ళడానికి సుకన్యకు భయమేసింది. పెళ్ళివారికి తన ముఖం చూపించ వద్దని ఏ పరిస్థితులలోను అక్కడికి రావద్దని శాసించేరు ధనలక్ష్మి లావణ్య. వాళ్ళ ఆజ్ఞమీరి నడుచుకుంటే ఏమవుతుందో సుకన్యకు బాగా తెలుసు అయినా సుందర్ ఆజ్ఞమేరకు కాఫీ టిఫిను తీసుకొని హాలులోకి ప్రవేశించింది నవ్వుల గల గలలతో తీయని మాటలతో ఛలోక్తులతో ఆ పరిసరాలు ప్రతిధ్వనిస్తున్నాయి కాఫీ టిఫెన్లు టేబులు మీద పెట్టింది సుకన్య.

పెళ్ళి చూపులకు వచ్చిన వారిద్దరి చూపులు సుకన్య మీదనే నిలిచిపోయాయి. సుకుమార్ తన చూపులను సుకన్య మీదనుంచి మరల్చలేకపోతున్నాడు. సుకుమార్‌ను ఆమె సౌందర్యం ఆకట్టుకుంటే అతని అన్నయ్యా పెళ్ళి పెద్దా అయిన విజయ్‌ను ఆమె వినయ విధేయతలు ముగ్ధుడిని చేశాయి:

"ఈ అమ్మాయి ఎవరు?" అప్రయత్నంగానే అనేశాడు విజయ్.

"ఈ అమ్మాయి దూరపు బంధువుల అమ్మాయి" శర్మ అనుకోకుండానే అతని పెదవుల మీదనుంచి జవాబొచ్చేసింది.

సుకుమార్ సుకన్యను లావణ్యను మార్చి మార్చి చూస్తున్నాడు అతనికి లావణ్యలో లేని అపురూప లావణ్యమేదో సుకన్యలో స్పష్టంగా కనిపిస్తోంది.

అన్ని అడంబరాలతో జరీ అంచు పట్టుచీరతొ విలువైన అభరణా లతో అతని ముందు కూర్చున్న లావణ్య చెమటపట్టిన ముఖంతో అలసటతొ అతని కనుల ముందు వినయంగా నిల్చున్న సుకన్య.

సుకన్య భగవంతుడు చేసిన కుందనపు బొమ్మలా కనిపిస్తోంది.

మీరు ఇలా ఈ కుర్చీలో కూర్చోండి.విజయ్ మాటకు సంకోచిస్తూనే కుర్చీలో కూర్చుంది విన మ్రతతొ సుకన్య.

"మీ పేరేమిటి?" మృదువుగా అడిగేడు సుకుమార్.

'సుకన్య' ఆమె కంఠం భయంతో గద్గదంగా ఉన్నా ఆ స్వరంలోని మాధుర్యం సుకుమార్ హృదయాన్ని హాయిగా తాకింది.

"పాటపాడుతారా" కాస్త చనువుగా అడిగేడు.

"చిన్నప్పుడు సంగీతం నేర్చుకున్నాను. ఇప్పుడు సాధన లేదండి" సుకుమార్ వైపు తలఎత్తి చూసింది సుకన్య.

లావణ్య ఇక సహించలేక సుకన్యను కొరకొరా చూస్తూ నువ్వు లోపలికి వెళ్ళు అంటూ ఆజ్ఞాపించింది.

"ఏం? ఈవిడ ఇప్పుడు మీకు సపర్యలు చెయ్యాలా?" నవ్వుతూ అన్నాడు సుకుమార్.

లావణ్యకు పట్టరాని కోపం వచ్చినా అతనిని చేసుకోబోయేది తనే కదా అని సమాయించుకొంది.

ఈ యింటికి వచ్చిన ఇంత కాలానికి తనతో కొద్ది క్షణాలు అప్యా యతగా మాట్లాడే ఇద్దరు వ్యక్తులను చూసింది. సుకన్య ఆ కొద్ది క్షణాలు అదేదో దివ్యలోకంలో తేలిపోయి నట్లనిపించింది అయితే ఆ క్షణాలే లావణ్యకు తనేదో నరకలోకంలో పడిపోతున్నట్లనిపించింది.

సుకన్య మీద ఉన్న ఆమె కసి రెట్టింపు అయ్యింది. తరువాత జరిగిన సంఘటన అగ్నికి ఆజ్యం తోడయినట్లు ధనలక్ష్మి లావణ్యాల మనస్సులను సుకన్య మీద మరింత ద్వేషంతో నింపింది.

మాధవశర్మకు మాత్రం అది ఏదో దైవ నిర్ణయంలా అదృష్టదేవత ఆశీర్వాదంలా అనిపించింది.

"అమ్మా! సుకన్యా! నువ్వు అదృష్టవంతురాలవు. నీ జీవితం చిగురించి! పరిమళించి దీపించే రోజు దగ్గరలోనే ఉందమ్మా, నీ నోములు పూజలు అన్నీ ఫలించేయి.

శర్మ మాటలకు అతనివైపు ఆశ్చర్యంగా చూసింది సుకన్య.

"అవునమ్మా, లావణ్యను చూడడానికి వచ్చిన అబ్బాయి నిన్ను వివాహం చేసుకుంటానన్నాడమ్మా. విజయ్ కూడా కట్నం కానుకలూ ఏవీ అక్కర్లేదు అన్నీ నిరాడంబరంగా పెళ్ళి జరిపిస్తే చాలుననీ చెప్పేడు. నీ సౌభాగ్యం చూస్తుంటే నాకు ముచ్చట వేస్తున్నాది" ఆమె చూపులకు బదులు యిచ్చేడు.

సుకన్య ఆనందంతో పరవశించి పోయింది, ఇప్పుడు ఆమె హృదయంలో ఎన్నో క్రొత్త క్రొత్త ఊహాలు. ఆ అందమైన కళ్ళల్లో సుకుమార్ రూపం.తను ఎప్పుడూ కన్నెలు సహజంగా తేలిపోయే ప్రణయ డోలలు ఊగలేదు కాని తను విహరించని సుందర మధుర స్వప్నాలు సుకన్యను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

సుకన్య సుఖంలో చిరునవ్వు చోటు చేసుకుంది. ఏంతో పట్టుదల గల శర్మ, సుకన్య పెండ్లి ముహూర్తం పెట్టించేడు. ఆనందంతో అవధానికి కూడా ఆ సంగతి వ్రాసేడు. తను ఈ యింటికి సుకన్యను దాసిగానే తీసు

కొని వచ్చినా అలాగే చూసినా అదృష్టదేవత, ఆమెను వరించి వచ్చినప్పుడు మాత్రం శర్మ ఆహ్వానించి సుకన్యకు ఆనందమయ జీవితాన్ని అందించ డానికి ఏ మాత్రం వెనుకంజ వేయలేదు. ఇది మానవత్వానికి మచ్చు తున కేమో మరి.

పెళ్ళి ముహూర్తం రెండు నెలల దూరంలో ఉండటంవల్ల సుకుమార్ సుకన్యను చూడకుండా ఉండలేక పోయేవాడు అప్పుడప్పుడు అతను ఇంటికి వస్తే సుకన్యను అతనితో నవ్వుతూ మాట్లాడమనే వాడు శర్మ.

సుకన్య జీవితం ఒక మలుపు తిరిగిపోయింది. త్వరలో తను ఆనం దపు టంచులు చూడబోతోంది తను ఎంతోఅదృష్టవంతురాలు, ఇదంతా శర్మ మామయ్య చలువే.

"ఏమిటి, సుకన్యా! నన్ను మరచిపోయి ఆలోచిస్తున్నావ్?" సుకుమార్ మాటలకు ఉలిక్కిపడింది.

అతను సుకన్యకు చాలా చేరువలో కూర్చున్నాడు. మరింత దగ్గరకు వచ్చి పలుకరించే సరికి సుకన్య ఉలిక్కిపడింది.

"అదే! మీరు వచ్చేరని ఇప్పుడే మామయ్య చెప్పేరు" అంది సిగ్గుతో తలవంచుకొనే.

"అంతేకాదు. మామయ్య ఈ సాయంత్రం మనం అలా హాయిగా తిరిగి రావడానికి కూడా అనుమతి ఇచ్చేరు. అవునా?" సుకన్యను చిలిపిగా చూస్తూ అన్నాడు.

"ఇప్పుడు నేను రాలేను బాబూ"సుకన్య అతవి చూపులను తప్పించు కొనే ప్రయత్నం చేసింది,

"ఇక్కడేం చేస్తావ్ మన పెళ్ళికి నీకు కావలసిన చీరలు నగలు మనలనే తెచ్చుకోమన్నారు. ఈ బంగారుబొమ్మ నా ప్రక్కనే ఉంటేగాని నేను సెలక్షను చేయలేను. నువ్వు నాతో రాకతప్పదు. సాయంత్రం నేను వచ్చేసరికి రడీగా ఉండాలి" సుకుమార్ వెళ్ళిపోతూ మరీ మరీ చెప్పేడు.

ఆ సాయంత్రం శర్మ సుకన్యను ఇంటిపని చెయ్యనివ్వలేదు "ఇక నువ్వు ఈ బెడదంతా పెట్టుకోనక్కర్లేదమ్మా. రేపటినుంచి వంటవాడు. పని మనిషి వస్తారు. మరో నెలరోజుల్లో నువ్వు మీ యింటికి వెళ్ళిపోతావుగా" సుకన్య కృతజ్ఞతగా శర్మకు నమస్కరించింది.

"అంతా మీ ఔదార్యం మామయ్యా"

"కాదమ్మా నీ అదృష్టం నాదేముందీ."

తన కారులో సుకన్యను. సుకుమార్‌ను పంపించేడు శర్మ.

సుకుమార్ ప్రక్కన ప్రయాణం సుకన్యకు ఏదో అనంత లోకాలలో తేలిపోతున్నట్లు అనిపించింది. తను ఇంతవరకూ ఎరుగని తీయని ఆ అనుభూతి నిలువెల్ల గిలిగింతలు పెడుతోంది. అతను ఎంతో మధురంగా మాట్లాడుతున్నాడు.

మరింత మధురంగా సుకుమార్ చెయ్యితాకుతూ ఉంటే పులకించి పోతోంది సుకన్య షాపింగు పూర్తి చేసుకొనే సరికి రాత్రి అయింది.

"సుకన్యా; ఆకలిగా ఉంది" అన్నాడు సుకుమార్.

మళ్ళా అన్నాడు. ఆకలిగా ఉంది కదూ? ఇంటికి వెళ్ళేసరికి మరీ ఆలస్యం అయిపోతుంది భోజనం చేసి వెళ్దాం"

సుకన్యకు అతని మాట వారించాలనిపించలేదు.

ఖరీదైన హోటలు ముందు కారాగింది. జీవితాంతం అనుసరించాలని కోరుకున్న సుకుమార్‌ను అనుసరించి అతనితో ఏకాంతంగా ఓ గదిలో తొలిసారి అడుగుపెట్టింది సుకన్య. ఆమె మనస్సంతా ఏదోలాగుంది.

తనకింత వరకూ తెలియని అనుభూతులు ఆమెను చుట్టేస్తున్నాయి.

సిగ్గు తెరలుతో బరువుగా వాలి పోతున్నాయి ఆమె కళ్ళు. చెక్కిళ్ళు ఎరుపెక్కాయి.

అతని సాన్నిధ్యాన్ని మరింతగా వాంఛిస్తున్నాది మనస్సు.

ఈ క్షణాలు ఎప్పుడూ ఆమెకు కావాలనిపిస్తోంది.

సుకుమార్ భోజనానికి ఆర్డరు చేసాడు.

"ఒక గంట కోసం రూమ్ తీసుకున్నారేమిట?" నెమ్మదిగా అంది.

"నువ్వే వడ్డిస్తే భోజనం చెయ్యాలని ఉంది. అదీ గాక మనం యిప్పుడు తీసుకున్న లేత గులాబీ చీరలో నిన్ను ఇప్పుడే చూడాలని ఉంది. నా కోరిక కాదనవుకదూ?"

చీర తీసి ఆమెకు మృదువుగా అందించేడు.

మరుక్షణంలో సుకన్య ఆ చీర ధరించి సుకుమార్ ఎదుట దేవకన్యలా నిలబడింది. లేత గులాబి రంగు చీరలో నిజంగా తను కూడా గులాబీలా ఆ అందంతో మెరిసి పోతోంది.

రెండు కళ్ళూ రెప్ప అర్పకుండా చూస్తున్నాడు.

ఆ చూపులు వలపు జల్లులలో నిలువెల్లా తడిసిపోయింది సుకన్య. ఆ క్షణం తన సర్వస్వాన్ని కోరుతున్నప్పుడు సంతోషంగా అంగీకరించి సుకుమార్‌కు తనకుతాను అంకితం చేసుకుంది.

మరుక్షణం ఇద్దరూ ఏదో పెద్ద పొరపాటు చేసినట్లుగా బాధపడ్డారు. శర్మను ఏకాంతంగా కల్సుకుని క్షమార్పణ వేడుకున్నారు. అతనిది సౌహార్ద్ర హృదయం. అతను ప్రేమతో మాటలనే అక్షింతలు వేసి వాళ్ళ మనస్సులపై జల్లేడు. ఇద్దరూ హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

నిజమే! శర్మ అన్నట్లు మరో నెలరోజుల్లో సుకన్య పూర్తిగా తనదే అయిపోతుంది" అనుకున్నాడు సుకుమార్.

పెళ్ళి ముహూర్తం దగ్గర పడుతున్న కొద్దీ లావణ్యకు మరింత మంటగా ఉంది. బుసలుకొడుతూంది మనస్సు. సుకన్య పెండ్లి చెడగొట్టే మార్గాన్వేషణలో పగలు రాత్రుళ్ళు గడుపుతోంది. లావణ్య హృదయం విషమయమయింది. మనస్సులో రగులుతున్న ద్వేషాగ్ని సుకన్యను దహించే వరకూ ఆమెకు శాంతిలేదు. తదేకంగా అదే విషయం ఆలోచిస్తుంది.

ఆమె దగ్గరలో ఆడుకుంటున్న తమ్ముళ్ళిద్దరూ ఒక్కసారిగా గట్టిగా కేకలు వేయడంతో వాళ్ళ దగ్గరికి వెళ్ళింది లావణ్య.

చెట్టుపైనున్న బాగాపండిన జామపండు నాదంటే నాదని తగవు లాడుకుంటున్నారు. సర్దిచెప్పేలోగానే వాళ్ళిద్దరిలో పెద్దవాడు చెట్టుపైకెక్కి ఆ దోరముగ్గిన పండును తనదగా చేసుకున్నాడు. అతని చేతిలో పండు నోటికే అందబోతోంది. ఆ క్షణాన్ని చూడలేని తమ్ముడు బలవంతంగా వాడి చేతిలోని పండును లాక్కొని పరుగెత్తి వెళ్ళి మురికి కాలువలోపడేసి వచ్చేడు ఓర్వలేమి ఎంతచెడ్డది. అంతే గబగబా లావణ్య లోపలికి వెళ్ళిపోయింది.

తను ఇంతసేపూ ఏ ఆలోచనలతో తెగక సతమతమవుతున్నదో దానికి ఓ పరిష్కారమార్గం ఆమెకు అతి సుళువుగా లభ్యమైంది. అంతే వెంటనే తను అనుకున్నట్టు దానిని కార్యరూపంలో పెట్టేసింది.

లావణ్య సుకన్యపై ప్రేమ నటిస్తోంది. సుకన్యకు కూడా ఆమెతో సన్నిహితంగా మెలగడం అలవాటై పోయింది లావణ్య ధోరణి అర్థం కాకపోయినా,

"సుకన్యా! క్రొత్తగా ఓ మంచి పిక్చరు వచ్చిందోయ్! ఇవేళే రిలీజు. ఎలాగైనా మనం మొదటిరోజున మొదటి ఆటే చూసెయ్యాలి, ఏమంటావ్."

లావణ్య మాటకు నవ్వుతూ 'మనం నాలుగు రోజులుగా పిక్చరు చూస్తూనే ఉన్నాంగా" అంటూ మళ్ళీ మాట సర్దుకొని లావణ్య ఏమి బాధ పడుతుందో అని "సరే లావణ్యా! ఈ రోజుకూడా వెల్దాములే" అంది.

"అది కాదు సుకన్యా! ఈవేళ నాకు కొంచెం బయటపని ఉంది."

"సరేలే అయితే రేపు వెల్దాములే" లావణ్య మాట పూర్తి కాకుండానే అంది. "కాదు ఈవేళే వెళ్ళాలి. ఒక పని చెయ్యి నువ్వు నేను మా కమల ఇంట్లో ఉంటాను. మొన్న వెళ్ళేముగా. వాళ్ళ ఇల్లు నీకు తెలుసు కదా పైమకి కొస్త ముందుగానే అక్కడికి వచ్చేయ్. నేను అక్కడే ఉంటాను. మరి తప్పక రావాలి సుమా" అని మరీ మరీ చెప్పింది లావణ్య.

ఆ సాయంత్రం లావణ్య చెప్పిన ఇంటికి వెళ్ళింది సుకన్య.

అక్కడ తనకు ఎదురు వచ్చి పలకరించింది పది రోజులుగా ఏక ధాటిగా తనపైని అనంతప్రేమ కురిపిస్తున్న లావణ్య కాదు.

[ 4 ]

"నువ్వు ఇక్కడున్నావా? లావణ్యా కమలా ఎక్కడ?" ఆదుర్దాగా భయంగా అడగబోతూ ఉంటే సుకన్య మాట పూర్తి కాకుండానే పగలబడి నవ్వుతూ "ముందు లోపలికిరా" అన్నాడు సుందర్.

భయంగానే లోపలికి నడిచింది. కమలా లావణ్యా ఎక్కడ ఉన్నారా అని అమాయకంగా చూస్తోంది. గది నాలుగు వైపులా.

"సుకన్యా నువ్వు ఎంత చూసినా ఏమీ లాభంలేదు. ఇక్కడ కమలా లావణ్యా లేరు. రారు. ఆ చూపులు మాని నన్ను ఒక్కసారి చూడు. నిన్ను ఇక్కడికి రప్పించింది నాకోసం. కాకపోతే మా లావణ్యా అదృష్టాన్ని నువ్వు కాళ్ళదన్ని ఆ గద్దెక్కి నువ్వు అందుకుంటావా? అందలం ఎక్కుతావా? ఎలా గెక్కుతావో చూస్తాం. అందుకే మాకసి ఇప్పుడు పూర్తిగా తీర్చుకొని నిన్ను సర్వనాశనం చేస్తాం" అంటూ సుకన్య మీదకు సింహం లేడిమీదకు ఉరికినట్లు ఉరికాడు.

"ఆగు! సుందర్ ఆగు! నన్నేమీ చేయకు. నేను మీకు ఏమి అపకారం చేశాను, మీ అందరికీ కోటి నమస్కారాలు నన్ను వదిలేయి" దిక్కుతోచక పిచ్చిగా అరవబోయింది సుకన్య. ఆమె రోదన అరణ్య రోదనే అయింది. తను ఇంతవరకూ ఆరాధించిన ఏ దైవమూ సుకన్య మీద జాలి చూపించలేదు. ఆమెను కాపాడడానికి కనీసం ఏ మానవుని రూపంలోనైనా దైవం సాయపడలేదు. లావణ్యా ఈర్ష్య వేయింతలుగా విష వృక్షమై సుకన్య జీవితంలోని సౌఖ్యాన్ని బలితీసుకుంది. సుకన్య జీవిత పోరాటంలో ఓడిపోయింది. ఆ నరరూప రాక్షసుడి కామాంధకారానికి బలిఅయిపోయింది. సుకన్య చీకటిలా మిగిలిపోయింది తనెప్పుడూ ఊహించని అదృష్టం ఆనందం ఆమెకు అంది అన్నీ కలలు లాగా కరిగిపోయాయి. మరి ఎప్పుడూ జంట కోరని ఒంటరి అయిపోయింది.

ఇప్పుడు సుకన్యకు వెలుగు చూడాలనిపించడంలేదు. చల్లని గాలిని ఆహ్లాద కరమైన వాతావరణాన్ని కోరడంలేదు. మరి ఎవ్వరితోను అను బంధాన్ని పెంచుకోవాలని పించడంలేదు. ఉన్న బంధాలన్ని తెంచేసుకోవాలనిపిస్తోంది. సుకన్య ఏడ్చింది. వెక్కి వెక్కి ఏడ్చింది విషయం అంతా తెలిసిన శర్మ సుకన్య నిర్ణయాన్ని కాదనలేక పోయాడు. అతని సహాయముతో స్త్రీల సదనంలో చేరిన సుకన్య చివరిసారిగా సుకుమార్‌కు లేఖ వ్రాసింది.

"నమస్కారం సుకుమార్‌గారూ.

మనిషి ఎంత యెత్తుకు ఎదిగినానను కుంటున్నాడో అంత క్రిందికి దిగజారి పోతున్నాడు. చంద్రమండలాన్ని జయించిన మానవుడు ఈర్ష్య అసూయలను జయించలేక పోతున్నాడు. స్వార్థానికి సమాధి కట్టలేక పోతున్నాడు. ఓర్వలేని తనం వదలలేక పోతున్నాడు. ఇవన్నీ కలసి నా జీవితాన్ని బలి తీసుకున్నాయి. నన్ను నీ నుంచి శాశ్వతంగా వేరుచేశాయి. ఈర్ష్య, అసూయ స్వార్థం, ఓర్వలేనితనం మూర్తీభవించిన లావణ్య నాకు మీతో జీవితాన్ని పంచుకొనే అదృష్టం లేకుండా చేసింది. నేను వివాహం చేసుకునే అర్హతను కోల్పోయాను. సుందర్ నన్ను పతనం చేశాడు.నన్ను మరచిపో. సుకుమార్, నన్ను మరచిపో నేను ఇప్పుడు స్త్రీల సదనంలో చేరాను; నా కాళ్ళమీద నిలబడి బ్రతికే ఏదో విద్య నభ్యసిస్తాను. నన్ను నీ హృదయం నుండి తొలగించుకో. ఆవేశంలో నన్ను నువ్వు క్షమించి నాతో వివాహానికి అంగీకరించినా అందుకు నేను సుముఖంగా లేను. భవిష్యత్తులో ఎప్పుడో నా జీవితం మీద ఏర్పడిన ఈ మచ్చ నీకు కొండంతదిగా కనిపించి మన ఇద్దరి మధ్య ప్రళయాన్ని సృష్టించవచ్చు. అందుకే నేను ఒంటరిగానే బ్రతుకుతాను సుకన్యగానే మిగిలిఉంటాను. భ్రమరం కోసం

మనసు పడని సంపెంగగా నిలిచి ఉంటాను.తోటి మానవుల సౌఖ్యానికి ఓర్వలేక బలి అయిపోయిన కథగా కన్నీటి గాథగా ఈ కన్యకథ సుకన్య కథ కలకాలం డైరీపేజీలలో లిఖించ బడుతుంది.

ఇక ఉంటాను,
మీకు ఏమీకాని
సుకన్య.

ఉత్తరం సుకుమార్‌కు పోష్టుచేసి తను ప్రారంభించబోయే క్రొత్త జీవితంలోకి అడుగుపెట్టి సదనం తోటివారితో కలసి పోయింది సుకన్య.

* * *